క్లుప్తంగా

కోర్టు క్యాలెండర్ ఆవిష్కరణ



భీమవరంలో కోర్టు క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం: స్థానిక బార్ అసోసియేషన్ హాల్లో గురువారం ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) కోర్టు టేబుల్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐఏఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెల్లబోయిన రంగారావు మాట్లాడుతూ న్యాయవాదులకు, కక్షిదారులు, పోలీసు, కోర్టు సిబ్బందికి క్యాలెండర్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై న్యూటన్, వైవి ఆనంద్, పాల రాఘవేంద్ర, ప్రభు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రెండోరోజు కొనసాగిన కలెక్టర్ల సదస్సు



కలెక్టర్ల సదస్సులో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

భీమవరం(ప్రకాశం చౌక్): రెండో రోజు రాష్ట్ర ముఖ్యమంత్రి అధ్యక్షతన నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలో పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి హాజరయ్యారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో కలెక్టర్ల సమావేశం నిర్వహించి స్వర్ణాంధ్ర ప్రదేశ్ - 2047 లక్ష్య సాధన, ప్రణాళిక, కార్యాచరణ తదితర అంశాలపై చర్చించారు. 26 జిల్లాల కలెక్టర్లు, 40 శాఖల అధిపతులతో జరిగిన ఈ సదస్సులో ముఖ్యమంత్రి వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.

అన్నదాతకు అండగా నిలుద్దాం



అంబటి రమేష్, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు

ఆకివీడు: దగా పడుతున్న అన్నదాతకు అండగా నిలుద్దామని, భీమవరంలోని కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు అంబటి రమేష్ గురువారం పిలుపునిచ్చారు. శుక్రవారం ఉదయం ఎనిమిది గంటలకు ఆకివీడు పట్టణం, మండలంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు, రైతు విభాగం, ఇతర విభాగాల ప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీ, జెడ్పీటీసీలు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఆరునెలల్లోనే, ఒకే ఒక్క సాగులో రైతన్నలు ఆర్థికంగా కుదేలైపోయారన్నారు. పండిన పంటకు పూర్తి మద్దతు ధర లభించడం లేదని, తేమ శాతం పేరుతో దళారులు, కమీషన్‌దారులు, ఇతరులు దోచుకుంటున్నారని రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు.

పల్లెల సుస్థిర అభివృద్ధే లక్ష్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సుహాసిని

ఆకివీడు: పల్లెల అభివృద్ధే దేశానికి పట్టుగొమ్మలని కేంద్ర ప్రభుత్వం భావించి సుస్థిర అభివృద్ధికి కృషి చేస్తుందని ఎంపీడీఓ సుహాసిని చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం స్థానిక ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, మండల అధికారులకు శిక్షణా కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీరాజ్ చట్టాన్ని ప్రజాప్రతినిధులు, సచివాలయ, మండల స్థాయి అధికారులు తెలుసుకోవాలన్నారు. పల్లెల్లో మౌలిక వసతులు ఏ విధంగా కల్పించాలనే అంశాలను సున్నితంగా పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ రమణమ్మ, వెలుగు ఏపీఎం జీ. శేషవేణి, హౌసింగ్ ఏఈ అభితేజ్, సర్పంచ్‌లు చిట్టిబాబు, నందమూరి ప్రకాశం, ముప్పానేని నాగేశ్వరరావు, కేశిరెడ్డి కోటీశ్వరి, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆయాలకు జీతాలివ్వాలని వినతి

పెనుగొండ: ఐదు నెలలుగా పాఠశాలల్లో పని చేస్తున్న ఆయాలకు జీతాలు అందక నానా అవస్థలు పడుతున్నారని సీఐటీయూ మండల కార్యదర్శి ఆవుల శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం తహసీల్దారు కార్యాలయం వద్ద, ఎంఈఓ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యం పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఆయాలు ధర్నా నిర్వహించి, తహసీల్దారు, ఎంఈఓలకు వినతి పత్రాలు సమర్పించారు. జూలై నుంచి ఇప్పటి వరకూ జీతాలు చెల్లించకపోవడంతో కుటుంబం గడవడం కష్టంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జీతాలు మంజూరు చేశామని చెబుతున్నా నేటికి వేతనాలు రాలేదన్నారు. జీతాలు చెల్లించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

రైతులకు కన్నీరు.. దళారులకు పన్నీరు

- అన్నదాతను కుంగదీస్తున్న కూటమి ప్రభుత్వం
- బాబు భరోసా లేక రైతన్నకు హైరానా



ఇటీవల తుఫాన్‌కు నేలకొరిగిన వరి చేను



ఖరీఫ్ మాసూళ్లు చేస్తున్న దృశ్యం

ఖరీఫ్ సాగు వివరాలు

మండలం	ఎకరాలు
ఆకివీడు	1,980
కాళ్ల	3,820
ఉండి	10,749
పాలకోడేరు	11,400

ఆకివీడు: చంద్రబాబు భరోసా లేక రైతన్నలు హైరానా పడుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత అన్నదాతలు సాగు చేసిన మొట్టమొదటి ఖరీఫ్ పంటకు పెట్టుబడి సాయం అందలేదు. దీంతో రైతులు పెట్టుబడుల కోసం మళ్లీ కాబోలోళ్ల చుట్టూ తిరగవలసి వచ్చింది. అధిక వడ్డీలకు అప్పులు చేసి ఖరీఫ్ సాగు చేపట్టారు. సాగు ప్రారంభం నుంచి ప్రకృతి విపత్తులతో రైతులు సతమతమవుతూ ఆర్థికంగా మరింత ఇబ్బందులు పడ్డారు. డెల్టా ప్రాంతంలోని ఉండి, ఆకివీడు, కాళ్ల, పాలకోడేరు మండలాల్లోని రైతులు రెండు మూడు సార్లు నారుమడులు, నాట్లు వేయాల్సి వచ్చింది. సాగు కష్టాల నుంచి గట్టెక్కుదామనుకుంటున్న తరుణంలో మళ్లీ విపత్తుల దాడికి గురి కావలసి వచ్చింది. పంట చేతికి అందివచ్చే సమయానికి దళారుల బెడద రైతులను మరింత నష్టపరిచింది.

రూ.10 వేలతో సరి

తుఫాన్, వరదల ప్రభావానికి పంట పూర్తిగా నష్టపోయిన రైతులుకు రూ.10 వేలు నష్టపరిహారం ఇచ్చి ప్రభుత్వం చేతులు దులుపుకుంది. ఎకరాకు రూ. 20 వేల నుంచి రూ.25 వేల పైబడి పెట్టుబడులు పెట్టిన రైతులు లబోదిబోమంటున్నారు. కొల్లేరు సరస్సు తీరంలోని వరద ప్రభావానికి ఆకివీడు మండలంలో 2,500 ఎకరాల పంట నీటమునిగి పూర్తిగా ధ్వంసమైంది. రైతులకు రూ.10 వేలు ప్రభుత్వం ఇవ్వడంతో చేలల్లో ముంపు వల్ల ఏర్పడ్డ తూడును తొలగించుకునేందుకు రైతుకు ఎకరాకు రూ.15 వేల నుంచి రూ. 20 వేల వరకూ వ్యయమైంది. నేటికీ ముంపు బారిన పడిన పొలాల్లో దాళ్వా సాగుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడతున్నారు.

ఊసేలేని పంటల బీమా

ఖరీఫ్ నష్టపోయిన రైతులకు పంటల బీమా ఊసే లేదు. గ్రామాలకు గ్రామాలు పంట నష్టపోగా బీమా అధికారులు రేండమ్ పద్ధతిలో నష్టం అంచనాలు వేయడంతో రైతులకు ఒక్క రూపాయి కూడా బీమా వచ్చే అవకాశం కన్పించడం లేదని లబోదిబోమంటున్నారు. పంటల బీమా కోసం ప్రభుత్వం ప్రీమియం చెల్లించలేదు. అయినప్పటికీ పలు గ్రామాల్లో బీమా అధికారులు పంట నష్టంపై అంచనా వేస్తున్నారు. అధికారుల అంచనాల ప్రకారం బీమా వచ్చే అవకాశం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బీమా లేదు, భరోసా లేదు, మా బ్రతుకులు ఎలా గట్టెక్కుతాయని రైతులు వాపోతున్నారు.

కొనుగోళ్లలో మార్పులతో రైతుకు నష్టం

ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రైతులు మరింత నష్టపోవలసి వచ్చింది. గత ప్రభుత్వ విధానాలకు స్వస్తి చెప్పి, రైతులు ధాన్యాన్ని ఏ మిల్లుకైనా అమ్ముకోవచ్చుననే నిబంధన రైతులకు కన్నీరు, దళారులకు పన్నీరుగా మారింది. తేమ, రవాణా పేరుతో రైతులను దళారులు దోచేస్తున్నారు. మద్దతు ధర దక్కనివ్వకుండా వారి ఇష్టానుసారం ధాన్యాన్ని రైతుల వద్ద కొనుగోలు చేసి మిల్లర్లకు విక్రయించి అధిక ధరలు పొందుతున్నారు. బస్తాకు రూ.50 నుంచి రూ.100 వరకూ అదనపు ధరతో దళారీ వ్యవస్థ మరింత బలపడుతుంది.

15న జాతీయస్థాయి యూత్ హాస్టల్స్ సభ్యుల సమ్మేళనం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంతెన, శ్రీనివాస్

భీమవరం: యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(వైహెచ్ఏఐ) భీమవరం యూనిట్ 35వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం భీమవరం పట్టణంలోని త్యాగరాజు భవనంలో కోరల్ జూబ్లీ పేరుతో జాతీయస్థాయి యూత్ హాస్టల్స్ సభ్యుల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు యూనిట్ జిల్లా అధ్యక్షుడు మంతెన వెంకట నర్సింహసీతారామరాజు చెప్పారు. గురువారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో సమ్మేళనం వివరాలను వెల్లడించారు. జాతీయస్థాయి సమావేశానికి వివిధ రాష్ట్రాలకు చెందిన 100 మంది యూత్ హాస్టల్స్ ప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు. సమావేశంలో యూనిట్ చైర్మన్ మట్లపూడి సత్యనారాయణ, ఆరేటి వెంకటసత్యనారాయణ, యూనిట్ కార్యదర్శి నందమూరి రాజేష్, తాళ్లపూడి గాంధీ, బోనం పాండురంగారావు, బొండా శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

బ్లాక్ మెయిల్ చేస్తున్న రాంబాబుపై చర్యలు తీసుకోవాలి



రాంబాబుపై చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను విజ్ఞప్తి చేస్తున్న సర్పంచ్‌లు

పాలకోడేరు: సమాచార హక్కు చట్టాన్ని ఉపయోగించుకుని తమను బ్లాక్ మెయిల్ చేస్తున్నారంటూ అతడిపై చర్యలు తీసుకోవాలని పాలకోడేరు మండలంలోని పలు గ్రామాల సర్పంచ్‌లు రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు కమిషనర్‌ను గురువారం కలిసి ఒక వినతి పత్రాన్ని సమర్పించారు. వివరాలివీ.. నైన్ టు నైన్ విలేఖరినని చెప్పుకుంటున్న సంకెళ్ల రాంబాబు సమాచార హక్కు చట్టం ద్వారా అధికారిక సమాచారాన్ని తెలుసుకుని, తమను బెదిరిస్తూ, రూ.లక్షల డిమాండ్ చేస్తూ, బ్లాక్ మెయిల్ చేస్తున్నాడని వారు ఫిర్యాదు చేశారు. ఈ చట్టాన్ని అడ్డుపెట్టుకుని తమను ఆర్థికంగా మానసికంగా వేధిస్తున్నాడని మండలంలోని శృంగవృక్షం, విస్సాకోడేరు, గొరగనమూడి, సర్పంచులు కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. రాంబాబుపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శృంగవృక్షం సర్పంచ్ జంగం సూరిబాబు, విస్సాకోడేరు సర్పంచ్ బొల్లా శ్రీనివాస్, పాలకోడేరు సర్పంచ్ ఇంజేటి మరియమ్మ లక్ష్మీపతి, వేండ్ర సర్పంచ్ కడలి నాగేశ్వరీ వీరబాబు, గొరగనమూడి సర్పంచ్ గొట్టుముక్కల శివరామరాజు (శివాజీ రాజు), మాజీ సర్పంచ్ చెల్లబోయిన పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి



భీమవరంలో ఐసీడీఎస్ కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

భీమవరం: అంగన్‌వాడీల సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలు జీఓలను వెంటనే విడుదల చేయాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.కళ్యాణి డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని గురువారం అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కళ్యాణి మాట్లాడుతూ అంగన్‌వాడీలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోజుకో యాప్ పేరుతో పని భారం పెంచుతున్నారు తప్ప పెరిగిన నిత్యావసర వస్తుల ధరలకు అనుగుణంగా జీతాలు పెరగడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు కె.ఝాన్సీలక్ష్మి, సహాయ కార్యదర్శులు ఎండీ హసీనా బేగం, సీహెచ్ రాణి, ఉపాధ్యక్షురాలు పి.తులసి తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులను వేధిస్తున్న రైల్వే అధికారులు



ప్లాట్‌ఫామ్‌పై నిలిపి ఉంచిన గూడ్సు రైలు

ఉండి: రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల పాలిట రైల్వే అధికారుల తీరు వింతగా ఉంది. వారిని వేధిస్తూ అధికారులు తమ సౌలభ్యం చూసుకుంటున్నట్లుంది. ప్రయాణికులు ఎన్నిసార్లు విన్నవించినా అధికారులు పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉంది. ప్రయాణికుల సౌకర్యమే తమకు ముఖ్యమని చెప్పే అధికారులు ప్రయాణికులను వేధింపులకు గురి చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే ఉండి రైల్వే స్టేషన్‌లో రెండు ప్లాట్‌ఫామ్‌లు ఉన్నాయి. మొదటి ప్లాట్‌ఫాంపై భీమవరం వైపుకు వెళ్లే రైళ్లు ఆగుతాయి. రెండో ప్లాట్‌ఫామ్‌పై విజయవాడ వైపు వెళ్లే రైళ్లు ఆగుతాయి. అయితే గత కొంతకాలం నుంచి రైల్వే అధికారులు ఒకటో నెంబర్ ప్లాట్‌ఫామ్‌పై ఏదైనా పాతరైలు భోగీలు, రైళ్లు లేదా ట్రాక్ రిపేరుకు వెళ్లే ట్రైన్ లేదా గూడ్సు రైలును రోజుల తరబడి నిలిపి ఉంచేతున్నారు. దీంతో విజయవాడ నుంచి వచ్చే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వారిలో అధికంగా రోగులు, వృద్ధులు, మహిళలు మరితంగా ఇబ్బందికి గురవుతున్నారు. చాలా ఎత్తులో ఉండే ఫుట్‌పాత్ బ్రిడ్జ్‌ను ఎక్కి రావాలంటే వృద్ధులు, రోగులు చాలా ఆవేదన చెందుతున్నారు. ఇదే విధంగా చాలాసార్లు రైళ్లు నిలిపి ఉంచడంతో ప్రయాణికులు ఇబ్బందులు రెట్టింపయ్యాయి. దీనిపై ఉండి రైల్వే ప్రయాణికుల సంఘ కార్యదర్శి సీహెచ్ బంగార్రావు స్పందించారు. ఈ విషయాన్ని చాలా సార్లు స్టేషన్‌మాస్టర్, రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారి నుంచి స్పందన కరువైందన్నారు.

భీమవరం పట్టణ సుందరీకరణకు చర్యలు



పట్టణంలో సుందరీకరణ పనులకు సూచనలిస్తున్న జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణ ప్రజలకు ఇబ్బంది లేని విధంగా ట్రాఫిక్ అడ్డంకులను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. గురువారం భీమవరం పట్టణంలోని అంబేడ్కర్, ప్రకాశం చౌక్ సెంటర్‌లలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి పర్యటించారు. పట్టణ సుందరీకరణలో భాగంగా అంబేడ్కర్ జంక్షన్ వద్ద అభివృద్ధి చేసేందుకు అంబేడ్కర్ విగ్రహం చుట్టూ లైటింగ్ ఏర్పాటు, బ్రిడ్జి పక్కన ఖాళీగా ఉన్న ప్రాంతంలో పార్కులా అభివృద్ధి చేసేందుకు ఏర్పాట్లు చేయాలని అన్నారు. ప్రకాశం చౌక్ వద్ద డ్రెయిన్ పై ఉన్న షాపుల తొలగింపునకు వెంటనే చర్యలు తీసుకుని, ప్రజలకు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చూడాలని మున్సిపల్ అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. జేసీ వెంట మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, ఏసీపీ శ్రీలక్ష్మి, మున్సిపల్ ఇంజనీర్ త్రినాధ రావు, డీఈఈ శ్రీనివాస్, టౌన్ ప్లానింగ్ అధికారి పార్థసారధి, తదితరులు ఉన్నారు.

ఫిర్యాదుపై విచారణ



సర్పంచ్ విజయకు వివరాలు అందిస్తున్న ఈఓపీఆర్డీ భాస్కరరావు

కాళ్ల: మండల కేంద్రమైన కాళ్ల గ్రామ పంచాయతీ మాజీ కార్యదర్శి పంచాయతీ సొమ్మును సొంతానికి వాడుకుని దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ సర్పంచ్ బందా విజయ తన భర్తతో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇచ్చిన ఫిర్యాదుపై గురువారం కాళ్ల పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఈవోపీఆర్డీ ఎంవీ భాస్కరరావు సమక్షంలో చేపట్టిన విచారణలో మాజీ కార్యదర్శి శివాజీ తాను ఏ విధమైన అవినీతికి పాల్పడలేదంటూ తాను చేసిన పనులకు సంబంధించి బిల్లులను సమర్పించారు. అల్లూరి సీతారామరాజు 125వ జయంతి సందర్భంగా 2022 జూలైలో భారత ప్రధాని నరేంద్ర మోడీ కాళ్ల మండలం పర్యటన సందర్భంగా యుద్ధ ప్రాతిపదికన పారిశుద్ధ్య పనులను చేపట్టామన్నారు. పంచాయతీ పరిధిలో జేసీబీ, ట్రాక్టర్లు, ఎన్ఎంఆర్ కూలీల సహకారంతో 2022 మే నుంచి జూలై వరకు పనులు నిర్వహించామని తెలిపారు. దీనిలో భాగంగా ఎవరెవరికి ఎంతెంత చెల్లించామనేది అధికారుల కౌంటర్ సంతకాలు, సప్లై దారుల సంతకాలు, ఎన్ఎంఆర్ అటెండెన్స్ అన్నీ సమర్పించినట్లు తెలిపారు. సదరు రిపోర్టు అంశాలను ఉన్నతాధికారులకు సమర్పించినట్లు ఈఓపీఆర్డీ స్పష్టం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బందా విజయ, ప్రసంగి, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

మొగల్తూరు: రైతుల భూసమస్యలను పరిష్కరించేందుకు నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులను శుక్రవారం మండలంలోని శేరేపాలెం, కొత్తపాలెం గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కె.రాజకిశోర్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఆయా గ్రామాల రైతులు ఈ సదస్సులకు హాజరై భూ సమస్యలపై వినతిపత్రాలను అందించాలని కోరారు.

యలమంచిలిలో..

యలమంచిలి: మండలంలోని రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి పంచాయతీ పరిధిలో ఈ నెల 13వ తేదీ నుంచి వచ్చే నెల మూడవ తేదీ వరకు మీ భూమి-మీ హక్కు నినాదంతో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ గ్రంధి పవన్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రెవెన్యూ సదస్సులు ప్రతి రోజు రెండు గ్రామాలలో నిర్వహిస్తారని పేర్కొన్నారు.

స్వల్పకాలిక కోర్సులో చేరండి

ఉండి: మండలంలోని ఎన్నార్పీ అగ్రహారంలోని ప్రభుత్వ ఐటీఐలో స్కిల్ హబ్ ఇనిటేటివ్ పథకంలో భాగంగా సోలార్ పీవీ ప్రాజెక్టు హెల్పర్ రెండు నెలల స్వల్పకాలిక కోర్సులో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తామన్నారు. ఐటీఐ జిల్లా కన్వీనర్ వి.శ్రీనివాసరాజు తెలిపారు. ఐదో తరగతి నుంచి ఆపై పాసై 15 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు కలిగిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఎన్నార్పీ అగ్రహారంలోని ప్రభుత్వ ఐటీఐలో నేరుగా వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. ఈ నెల 21వ తేదీతో రిజిస్ట్రేషన్ల గడువు ముగిస్తుందని తెలిపారు. పూర్తి వివరాలకు 9676099988 నెంబర్‌లో సంప్రదించాలని శ్రీనివాసరాజు తెలిపారు.

మోటారు సైకిల్ ఢీకొని వ్యక్తికి గాయాలు

భీమవరం: భీమవరం టూటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని ప్రకాష్‌నగర్‌లో మోటారు సైకిల్ ఢీకొని టి.సత్యనారాయణ అనే వ్యక్తి గాయపడినట్లు టుటౌన్ ఎస్సై రెహమాన్ చెప్పారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 11న సత్యనారాయణ ఇంటి నుంచి బయటకు వచ్చి రోడ్డుపై నిలబడగా గుర్తు తెలియన వ్యక్తి మోటారుసైకిల్ నిర్లక్ష్యంగా వచ్చి ఢీకొనడంతో సత్యనారాయణ గాయపడ్డాడు. వెంటనే చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రిలో చేరగా ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ఐబీఆర్ అచీవర్ శ్రీజకు సత్కారం



చిన్నారి జస్వికశ్రీజకు ట్యాబ్ అందిస్తున్న సర్పంచ్ సుబ్బారావు

కాళ్ల: అ,ఆలు కూడా దిద్దడం రాని మూడేళ్ల చిన్నారి దేశంలోని అన్ని రాష్ట్రాలు, వాటి రాజధానుల పేర్లు ఇంగ్లీషులో చెప్పడంతో పాటు, మానవ శరీరంలోని అన్ని అవయవాల పేర్లను ఇంగ్లీషులో చెప్పి ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో చోటు సాధించడం తమ గ్రామానికే గర్వకారణమని దొడ్డనపూడి సర్పంచ్ కొల్లి సుబ్బారావు అన్నారు. కాళ్ళ మండలం దొడ్డనపూడి గ్రామంలో ఇటీవల ఇండియా బుక్ ఆఫ్ రికార్డుశ్‌లో చోటు సంపాదించిన చిన్నారి కొల్లి జస్వికశ్రీజకు గురువారం గ్రామస్తులు అభినందనసభ నిర్వహించారు. సెల్ ఫోన్‌లో చూసి గుర్తు పెట్టుకుని ప్రతిభ కనబరిచి ఐబీఆర్ అచీవర్‌గా పేరు సంపాదించిన చిన్నారి శ్రీజకు సుమారు రూ.25,000 విలువ గల ట్యాబ్‌ను బహూకరించారు.

విద్యుత్ చార్జీల పెంపు దారుణం



సమావేశంలో మాట్లాడుతున్న జార్జి



విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న సీపీఎం మహిళా నాయకులు



భీమవరం అర్బన్: దెయ్యాలతిప్పలో విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న దృశ్యం

భీమవరం: ఎన్నికల్లో విద్యుత్ ఛార్జీలు పెంచబోమని చెప్పిన కూటమి నాయకులు విద్యుత్ వినియోగదారులపై సర్దుబాటు చార్జీల పేరుతో భారాన్ని మోపడం ఏరు దాటిన తరువాత తెప్ప తగలబెట్టటమేనని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బాతిరెడ్డి జార్జి విమర్శించారు. గురువారం భీమవరంలో నిర్వహించిన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం జనవరి 8 వరకు నిర్వహించే రెవెన్యూ సదస్సులు అసైన్డ్ భూముల వివరాలు పంచాయతీ ఆఫీసుల వద్ద పెట్టాలని కోరారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను పేదలకు పంపిణీ చేయాలని, పేదలు నిర్మించుకునే ఇళ్లకు రూ. 5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు, గుబ్బల నాగేశ్వరరావు, పోతుల మృత్యుంజయ తదితరులు పాల్గొన్నారు.

దెయ్యాలతిప్పలో..

భీమవరం అర్బన్: ప్రజలపై వేస్తున్న విద్యుత్ ట్రూ అప్, అదనపు ఛార్జీలను రద్దు చేయాలని సీపీఎం పార్టీ మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. భీమవరం మండలంలోని దెయ్యాలతిప్ప గ్రామంలో గురువారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో పెరిగిన విద్యుత్ బిల్లులను దహనం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు విద్యుత్ ఛార్జీలు పెంచబోమని చెప్పి అధికారం చేపట్టి 6 నెలలు లోపే విద్యుత్ ట్రూ అప్ ఛార్జీలు, స్మార్ట్ మీటర్లు అంటూ విద్యుత్ ఛార్జీలు పెంచి వేల కోట్లు భారాన్ని ప్రజలపై మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఒడుగు నారాయణ, నాగిడి వెంకటేశ్వర్లు, రామాయణం కృష్ణమూర్తి, ఆంజనేయులు, బురిడి దొర, తిరుమల నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలు తొలగించాలి

ఆకివీడు: ప్రజలపై పెనుభారంగా విద్యుత్ చార్జీలను పెంచడం దారుణమని సీపీఎం మహిళా నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక 14వ వార్డులో సీపీఎం మహిళా శాఖ విభాగం ఆధ్వర్యంలో ప్లకార్డులతో గురువారం నిరసన వ్యక్తం చేస్తూ విద్యుత్ బిల్లులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కమిటీ సభ్యురాలు బి.కళ్యాణి, సీనియర్ నాయకురాలు జీవీ లావణ్య మాట్లాడుతూ ప్రజలపై విద్యుత్ భారాలు వేయమని చెప్పిన కూటమి ప్రభుత్వం ఆరు నెలలు తిరగకుండానే ట్రూఅప్ చార్జీల పేరుతో భారీ వడ్డనలు చేశారని ఆరోపించారు. సామాన్య, మధ్య తరగతి ప్రజలపై విద్యుత్ భారాలు వేస్తే సహించేది లేదని హెచ్చరించారు. తక్షణమే పెంచిన విద్యుత్ ఛార్జీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్థానికులు కె.యశోద, విజయ, బీ.మంగ, పీ.అమ్మడు, పీ.నాగమణి, గేదల రాము పాల్గొన్నారు.

జోరుగా మాసూళ్లు



ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్న దృశ్యం

పెనుగొండ/నరసాపురం రూరల్: ఫెంగల్ తుఫాన్ నుంచి బయట పడడంతో రెండు రోజుల నుంచి రైతులు వరి మాసూళ్లు జోరుగా సాగిస్తున్నారు. మళ్లీ మరో తుఫాన్ తాకిడి ఉందన్న విస్తృత ప్రచారంతో రైతుల్లో గుబులు రేపుతుంది. ఫెంగల్ తుపాన్‌లో కోతలు చేయవద్దంటూ అధికారులు ప్రకటించడంతో వారం రోజులపాటు కోతలు నిలిపి వేశారు. తుఫాన్‌కు ముందు ఆచంట నియోజకవర్గంలో కేవలం పది శాతం లోపు మాత్రమే కోతలు కోశారు. వాటిని రైతులు మిల్లులకు చేర్చుకొని నష్టం లేకుండా బయటపడ్డారు. అక్కడక్కడా నేలకొరిగిన వరి పనలు తప్ప భారీగా నష్టం వాటిల్లలేదు. ప్రస్తుతం వాతావరణం అనుకూలిస్తున్నా, మధ్యమధ్యలో మబ్బులు పడుతూ భయపెడుతుంది. దీంతో సాధ్యమైనంత త్వరగా కోతలు పూర్తి చేయడానికి రైతన్నలు ముందుకు వస్తున్నారు. దీంతో కోత మెషీన్లు ఇబ్బంది తలెత్తినా, రైతులు నిర్వాహకులు వెంట పడి మరీ కోతలు పూర్తి చేసుకుంటున్నారు. ఆది, సోమవారాల్లో కొన్ని గ్రామాల్లో చిరుజల్లులు పడ్డాయి. దీంతో నేల చిత్తడిగా మారింది. చిత్తడిగా మారిన ప్రాంతాల్లో కోతకు అదనంగా మరో రెండు వేల రూపాయల వరకూ ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది.